క్లుప్తంగా

కష్టపడి చదవాలి



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న విజయలక్ష్మి

కోనరావుపేట: వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు కష్టపడి చదివి గుర్తింపు తీసుకురావాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ధర్మారం ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని, నాణ్యమైన భోజనం పెడుతున్నామన్నారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని కోరారు. ఆమె వెంట వార్డెన్ కోయల్‌కార్ శ్రీనివాస్ ఉన్నారు.

బకాయి ఉన్న మీటర్ కనెక్షన్ కట్ చేశాం

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటకు చెందిన విద్యుత్ వినియోగదారుడి బిల్లు బకాయిపడ్డ విద్యుత్ కనెక్షన్‌ను మాత్రమే కట్ చేశామని సెస్ ఏఈ పృథ్వీధర్ తెలిపారు. 'బకాయి ఒకటి.. కట్ చేసింది మరొకటి!' శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. యేసురత్నం అనే వినియోగదారుడు 6060102833 మీటర్‌పై రూ.9842 బకాయిపడడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. అయితే మరో కనెక్షన్ 6060104575 సమాధానం పేరిట విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. యేసురత్నంకు సంబంధించిన మీటర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ఏఈ స్పష్టం చేశారు.

ఉచిత రక్తపరీక్ష శిబిరం



శిబిరంలో కౌన్సిలర్ నీరజ తదితరులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ ఆధ్వర్యంలో శనివారం కనెక్ట్ డయాగ్నొస్టిక్ వారు ఉచిత రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ హనుమాన్ దేవాలయ ఫంక్షన్ హాలులో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, సుమారు వంద మందికి సీబీపీ, ఎఫ్‌బీఎస్ తదితర పరీక్షలు చేశారు. కుడిక్యాల శంకర్, స్వర్గం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉంటున్న రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. సోమవారం హైదరాబాదులో నిర్వహించే ధర్నాకు సంబంధించి లేఖ అందజేసి నట్లు తెలిపారు. 18 ఏళ్లుగా 2వ ఏఎన్ఎంలుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారిని జీవో నంబరు 16లో చేర్చి రెగ్యులర్ చేయాలని గతంలోనే విన్నవించడం జరిగిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో పరీక్షలు లేకుండా రెగ్యులర్ కావని గత డిసెంబర్ 29న పరీక్ష నిర్వహించారని, కానీ వయసు రీత్యా పరీక్షకు అర్హత లేకుండా పోయిందని, అలాంటి వారికి వంద శాతం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు అజ్జ వేణు, 2 ఏఎన్ఎం నాయకురాలు కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

రేపు కృత్రిమ అవయవాల ఎంపిక శిబిరం

సిరిసిల్లటౌన్: శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్టు మంగళపాలెం కొత్తవలస విజయనగరం వారి సహకారంతో సోమవారం జిల్లా కేంద్రంలో కృత్రిమ అవయవాల ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ ట్రస్ట్ ఇన్‌చార్జి లంకదాసరి శ్రీనివాస్, అస్గర్ మొహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో తెలంగాణ భవనంలో ఉదయం 9.30 నుంచి 3.00 గంటల వరకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాల ఎంపిక శిబిరం నిర్వహిస్తారని, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడం శ్రీనివాస్ 94403 82919, జిల్లా అధ్యక్షుడు మామిడాల నరేశ్ 79899 01914, మహిళా అధ్యక్షురాలు దిండిగల లక్ష్మి 99516 50199, జిల్లా ఉపాధ్యక్షులు యేల్లె హరిప్రసాద్ 63023 37617, మంగళారపు రాజేందర్ 98903 71361 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రెండేళ్ల నిర్లక్ష్యం..!

- బీటీ వేశారు.. సైడ్ బర్మ్స్ మరిచారు
- తరుచూ ప్రమాదాలు
- రోడ్డు దిగితే బోల్తా పడుతున్న వాహనాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



బండపల్లిలో బోల్తాపడిన ధాన్యం లారీ(ఫైల్)



ఇరువైపులా మట్టిలేకుండా ప్రమాదకరంగా ఉన్న బండపల్లి-ఎన్గల్ రోడ్డు



ఎన్గల్ శివారులో బోల్తాపడిన కారు (ఫైల్)

చందుర్తి: తారు రోడ్డు వేయించిన ఆర్అండ్‌బీ అధికారులు సైడ్ బర్మ్స్ మరిచారు. ఎదురెదురుగా వచ్చే వాహనదారులు సైడ్ ఇచ్చుకోవాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్డు దిగాల్సిన పరిస్థితి. ఈక్రమంలో పలు వాహనాలు బోల్తాపడిన సందర్భాలు చాలా ఉన్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి తారు వేయించిన అధికారులు ఇరువైపులా మట్టి పోయించడంలో రెండేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

స్పీడ్‌గా వెళ్తే అంతే..

రెండేళ్ల క్రితం రూ.కోటి 49లక్షల అంచనాలతో వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట నుంచి చందుర్తి మండలం ఎన్గల్, బండపల్లి గ్రామాల మీదగా కోనరావుపేట మండలం బావుసాయిపేట వరకు 10 కి.మీ రోడ్డు పనులు ప్రారంభించారు. పక్షం రోజుల్లోనే పూర్తి చేశారు. కానీ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించలేదు. దీంతో వాహనదారులు ఓవర్ స్పీడ్ వెళ్లి రోడ్డు దిగితే పల్టీలు కొట్టి కింద పడిపోయిన ఘటనలు కోకొల్లలు. ద్విచక్ర వాహనాదారులే కాకుండా పదుల సంఖ్యలో కార్లు, లోడుతో ఉన్న రెండు లారీలు, ట్రాక్టర్లు బోల్తాపడిన సందర్భాలు ఉన్నాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అంచనాలు తక్కువగా ఉన్నాయని..

తారురోడ్డు పనులు గిట్టుబాటుగా ఉండడంతో కాంట్రాక్టర్ ఆగమేఘాల మీద పనులు చేసి చేతులు దులుపుకున్నాడని విమర్శలు వస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించేందుకు అంచనాలు తక్కువగా ఉండడంతో ఆ పనులు చేయలేక సదరు కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం కూడా మరో కారణంగా ప్రచారంలో ఉంది. అలాగే దారిపై మూలమలుపులు, పాఠశాలల వద్ద సూచిక బోర్డులు మరిచిపోయారు. వాహనాదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించాలని కోరుతున్నారు.

మట్టి పోయించాలి



తారు వేయడంతో రోడ్డు మరింత ఎత్తు పెరిగింది. ఎదరుగా భారీ వాహనాలు వస్తే రోడ్డు దిగుదామంటే ద్విచక్ర వాహనదారులు కిందపడిపోతున్నారు. తారు వేసిన వెంటనే మట్టి పోయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– లాండే సత్యం, ఎన్గల్

తరచూ ప్రమాదాలు..



కాంట్రాక్టర్ తారు రోడ్డు వేసి మట్టి పోయకుండా వదిలి పెట్టడంతో తరుచూ ద్విచక్ర వాహనాలు, కార్లు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. రెండేళ్లుగా వందకు పైగా ప్రమాదాలు జరిగాయి. రోడ్డుపై వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మట్టి పోయించాలి.

– న్యాత సాయిబాబా, డ్రైవర్, బండపల్లి

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట నుంచి చందుర్తి మండలం ఎన్గల్, బండపల్లి మీదగా కోనరావుపేట మండలం బావుసాయిపేట వరకు 10 కి.మీ తారు రోడ్డుకు ఇరువైపులా సైడ్ బరమ్స్‌లో మొరం పోయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం. నిధులు మంజూరు కాగానే సైడ్ బరమ్స్ పనులు పూర్తి చేస్తాం.

– నవ్యశ్రీ, ఆర్అండ్‌బీ ఏఈ, చందుర్తి



సిరిసిల్ల: వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిపై వేములవాడ మండలం మర్రిపల్లి వద్ద కల్వర్టు నిర్మాణంలో ఉంది. ఇక్కడ మట్టితో అప్రోచ్‌రోడ్డు నిర్మించడంతో నిత్యం దుమ్ముతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దుమ్ము తీయలేని విధంగా వాహనదారులకు దుమ్ము వస్తుంది. పక్కనే కస్తూరిబాగాంధీ విద్యాలయం ఉంది. అక్కడి విద్యార్థులకు ఈ దుమ్ముతో ఇబ్బందిగా ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే దుమ్ము రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలి. అప్రోచ్ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



– సాయికిరణ్, మర్రిగడ్డ, చందుర్తి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
శాంతయ్య, ఆర్అండ్‌బీ డీఈఈ, సెల్: 94408 18154

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మహనీయుల పేర్లతో జంక్షన్ల ఏర్పాటు సంతోషకరం

- విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణలో భాగంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని గతంలో కంటే 1 ఫీట్ ఎక్కువగా పెంచి ఏర్పాటు చేయడం, సుభాష్‌నగర్‌లో సుభాష్ జంక్షన్ అభివృద్ధి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, తదితరులతో పనులు ప్రారంభించారు.



సుభాష్ జంక్షన్‌ను ప్రారంభిస్తున్న విప్ ఆది, చైర్‌పర్సన్ మాధవి, నాయకులు

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

- ఎనిమిది అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో కౌన్సిలర్లు,



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా సాగింది. శనివారం ఉదయం 11 గంటలకు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల అవసరాలు, పురపాలక సంఘ వార్డుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 8 అంశాలతో ఎజెండా తయారు చేయడం జరిగిందన్నారు. దానిని సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులతో చర్చించి మొత్తం అంశాలను ఆమోదించుకోడం జరిగిందన్నారు. పాలకవర్గం ఏర్పాటై ఐదు సంవత్సరాలు విజయవంతంగా పదవీకాలం పూర్తి చేసుకుంటున్నా సందర్భంగా పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో వెన్నంటి ఉన్న మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు, పాలకవర్గ సభ్యులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వాటా ప్రకారమే నిధులొచ్చాయి



మాట్లాడుతున్న ప్రకాశ్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో వాటా ప్రకారమే సిరిసిల్లకు నిధులొచ్చాయని దానిని బీఆర్ఎస్ సాధించిన ఘనతగా ఎమ్మెల్యే కేటీఆర్ చెప్పుకోవడం శోచనీయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.25వేల కోట్ల బడ్జెట్ ఉండగా..తెలంగాణ వచ్చాక రూ.2లక్షల కోట్లకు పెంచుకోవడం జరిగిందని, ఈక్రమంలోనే సిరిసిల్ల, వేములవాడకు వాటా ప్రకారం నిధులు ఇచ్చారని ఇందులో బీఆర్ఎస్ గొప్పదనం లేదన్నారు. బీఆర్ఎస్ సర్కారు రాకముందు సిరిసిల్లలో రూ.200కే ట్రాక్టర్ ఇసుక వచ్చేదని, దానిని రూ.2000 పెంచి అక్రమ సంపాదనకు తెగబడ్డారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనవసరంగా నోరు పారేసుకుంటే సహించబోమన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని గొప్పగా చెప్పుకోవడం మానుకుని ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు కత్తెర దేవదాసు, గడ్డం నర్సయ్య, నీలి రవీందర్, కల్లూరి చందన, కొట్టెపల్లి సుధాకర్, దుబాల వెంకటేశం, యెల్లె లక్ష్మీనారాయణ, గుండ్లపెల్లి గౌతం, బొద్దుల శ్రీనివాస్, నక్క నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట: మండలంలోని తిప్పాపురం గ్రామ అంబేడ్కర్ సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దమ్మని అజయ్, ఉపాధ్యక్షుడు బెజ్జంకి భాను, ప్రధాన కార్యదర్శి బర్ల వంశీ, కల్చరల్ కార్యదర్శి దమ్మని వినయ్, సంయుక్త కార్యదర్శి దమ్మని రాములు, కోశాధికారి రణం మనోహర్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా రాయినిపట్ల వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు, దమ్మని లక్ష్మణ్ పాల్గొన్నారు.

'యువచైతన్య' అధ్యక్షుడిగా శంకర్

కోనరావుపేట: మండలంలోని నాగారం యువచైతన్య దీపం ఫౌండేషన్ గ్రామశాఖ అధ్యక్షుడిగా బొడ్డు శంకర్ ఎన్నికైనట్లు మండల ఇన్‌చార్జి కొమ్ము ప్రశాంత్ తెలిపారు. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శేఖర్ సేనాపతి మాట్లాడుతూ, వేములవాడ నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు సాయం అందించేందుకు ఈ సంస్థ ఏర్పాటు చేశామన్నారు. పుట్టిన రోజు, ఇతర వేడుకలకు పెట్టే డబ్బులను తమకు అందిస్తే వారి పేరిట అనాథలకు భోజనాన్ని అందిస్తున్నామన్నారు. అలాగే వేడుకల్లో మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సైండ్ల నాగరాజు, చంద్రయ్య, బొడ్డు భూమయ్య, భాస్కర్, అశోక్, నర్సయ్య, శేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని మర్రిమడ్ల ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వార్డు మెంబర్లు, సర్పంచ్‌గా పోటీ చేశారు. స్థానిక ఎన్నికలు ఎలా జరుగుతాయో వివరించారు. హెచ్ఎం ఎంవీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బి.రవి, భాస్కర్, మంజుల, శాంతాకుమారి, బాబు, సతీశ్, ఇష్రాత్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: సీఎంఆర్ఎఫ్‌తో బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. శనివారం ముస్తాబాద్‌లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, తాళ్ల విజయ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు. అలాగేఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. నాయకులు కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, కొండాపురం బాల్‌రెడ్డి, పర్శరాములు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

కోనరావుపేట: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో మురళీనాయక్ అన్నారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా శనివారం కోనరావుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, టై, బెల్ట్, ఐడీకార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు,తూ పీఎంశ్రీ పథకానికి కోనరావుపేట పాఠశాల ఎంపికయిందన్నారు. హెచ్ఎం మదన్‌లాల్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఆడెపు రాజేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాళ్లపేటలో పథకాల ప్రారంభం

తంగళ్లపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను లాంఛనంగా ప్రారంభించేందుకు పైలెట్ గ్రామంగా రాళ్లపేటను ఎంచుకున్నట్లు ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభిస్తామని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

చందుర్తి: ఈనెల 1వ తేదీ కంటే ముందు పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు పెట్టుబడి సాయం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి దుర్గారాజు కోరారు. దరఖాస్తులను వ్యవసాయ విస్తీర్ణాధికారికి సమర్పించాలని పేర్కొన్నారు.

బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడఅర్బన్: ఓటు హక్కు అందరి బాధ్యత అని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శనివారం వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో గల తెలంగాణచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, డీటీ రజిత, ఆర్ఐ సతీశ్, సుమలత, జ్యోతి, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అందరి బాధ్యత

తంగళ్లపల్లి: ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. సూపరింటెండెంట్ దొంతుల రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



సిరిసిల్లలో విద్యార్థుల ర్యాలీ



బోయినపల్లి: అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల/ఇల్లంతకుంట/వీర్నపల్లి/బోయినపల్లి/ముస్తాబాద్/వేములవాడరూరల్/రుద్రంగి/కోనరావుపేట: జిల్లాలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఓటు ఆవశ్యకతను చాటిచెప్పారు. ఇల్లంతకుంటలో తహసీల్దార్ ఎంఎ పారుక్ ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ మారుతిరెడ్డి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బోయినపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేశారు. మోడల్‌స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముస్తాబాద్‌లో జెడ్పీ పాఠశాల నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రుద్రంగి మండల కేంద్రంలో పోలీసులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కోనరావుపేట మండలం ధర్మారంలో గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఉత్సాహంగా సీనియర్ సిటిజన్ క్రీడా పోటీలు

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని టౌన్ క్లబ్ ఆవరణలో శనివారం సీనియర్ సిటిజన్లకు ఇండోర్ గేమ్స్ నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. క్యారంబోర్డు, చదరంగం, కలర్ మ్యాచింగ్, రింగ్ బాల్, టెన్నికాయిట్ తదితర పోటీలు నిర్వహించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు గొట్టె అంజయ్య, వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మ క్రీడలను పర్యవేక్షించారు. గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మహిళాధ్యక్షురాలు కాముని వనిత, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు రాపెల్లి లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నీలి రవీందర్, సీనియర్ సిటిజన్ల సంఘం ప్రతినిధులు చేపూరి బుచ్చయ్య, జనపాల శంకరయ్య, గౌరిశెట్టి ఆనందం, రాజోలు వేర్, కైలాసం, మాదిరెడ్డి అంజనీదేవి, రామరాజు, శంకరయ్య, దొంత దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రుద్రంగి: నేషనల్ రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అవగాహన కల్పించారు. పోలీస్ అక్క కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఏఎస్సై కన్నీరాం వివరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.